PRGI No: TGBIL/25/A0946

# విశాలజ్యోతి

సమగ్ర తెలుగు దినపత్రిక

approved by Govt of INDIA, TELANGANA
DK MEDIA
OUR SERVICES
* NEWS PAPER * DK ADS & PROMOTIONS
* NEWS CHANNEL * DK PRINTERS
* DK GRAPHICS * DK PUBLICATIONS
WE'RE HIRING REPORTERS
for more details 9440711117, www.vishalajyothi.com

వరంగల్ సంపుటి : 02 సంచిక : 92 శనివారం, అక్టోబర్ 31 2026 , పేజీలు - 4 వెల : 5 రూ/-

### ఆఖరి శ్వాస వరకు

## ప్రజా సేవ చేస్తూనే ఉంటా

- ఆఖరి శ్వాస వరకు ప్రజా సేవ చేస్తూనే ఉంటా

దేశం కష్టాల్లో ఉంటే కొందరు సంతోషిస్తున్నారు

- దేశానికి అత్యంత బలమైన స్తంభాల్లో అన్నదాతలు

ఒకరని ప్రధాని మోదీ అన్నారు. గుజరాత్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.

**న్యూ ఢిల్లీ :**దేశం కష్టాల్లో ఉంటే సంతోషించే వ్యక్తులు కొందరు ఉన్నారని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. తనను అప్రతిష్టపాలు చేసేందుకు ఇరాన్ యుద్ధం తర్వాత రైతులకు ఎరువులు, ప్రజలకు ఎల్పీజీ గ్యాస్ అందవని కొందరు పనిగట్టుకుని వదంతులు సృష్టించారని మండిపడ్డారు. తన ఆఖరి శ్వాస ఉన్నంత వరకు ప్రజలకు సేవ చేస్తూనే ఉంటానని ప్రధాని తెలిపారు. గుజరాత్‌లోని బనస్కాంతలో 14వేల కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని మోదీ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అలాగే ఖిల్డీలో ఏర్పాటు చేసిన 'భారత్ బోవిన్ బ్రీడింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్'ను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్న ప్రధాని మోదీ ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చితుల మధ్య ఎరువుల ధరలు భారీగా పెరిగినా ఆ భారాన్ని రైతులపై పడకుండా తమ ప్రభుత్వం అడ్డుకుందని తెలిపారు. తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చి, వారిని సాధికారులను చేసిందని తెలిపారు.

### రూ.1.50 లక్షల కోట్ల ప్రభుత్వ

## భూములను కాపాడాం

- మియాపూర్‌లో 550 ఎకరాలపై సుప్రీంకోర్టు తీర్పు
- భూముల విలువ రూ.50 వేల కోట్లు అని సీఎం వెల్లడి
- రూ.1.50 లక్షల కోట్ల ప్రభుత్వ భూములు కాపాడినట్లు ప్రకటన
- కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై భూ ఆక్రమణ ఆరోపణలు

**హైదరాబాద్ :**మియాపూర్‌లోని 550 ఎకరాల భూములను కొల్లగొట్టేందుకు కేసీఆర్, ఆయన బంధువులు అనేక రకాలుగా ప్రయత్నించారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. భూములను కొట్టేసేందుకు గోల్డ్‌స్టోన్ ప్రసాదరావు ప్రయత్నించారన్న ఆయన ఈ భూముల విషయంలోనే బీఆర్?ఎస్ రాజ్యసభ ఎంపీ దామోదరరావుకు ప్రసాదరావు ఖరీదైన కారు బహుమతిగా ఇచ్చారని అన్నారు.కేసీఆర్ సర్కారు ఏ ప్రయత్నం చేయలేదుకొందరు అధికారులను అడ్డంపెట్టుకుని భూములు కొట్టేయాలని బీఆర్?ఎస్? నేతలు చూశారన్న సీఎం రేవంత్ రెడ్డి ఈ వివాదంలో ఆ అధికారులు కూడా అరెస్టయ్యారని తెలిపారు. మియాపూర్‌లోని 550 ఎకరాలను కాపాడేందుకు కేసీఆర్ సర్కారు ఏ ప్రయత్నం చేయలేదని అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ఈ కేసుపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలిపారు. సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించి రూ.50 వేల కోట్ల ఆస్తిని కాపాడుకోగలిగామని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పు రాగానే ఈ భూములు స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. అవసరమైతే ఈ భూములను వేలం వేసి దళిత, బహుజనుల కోసం ఖర్చు చేస్తామని ప్రకటించారు.

## యూపీలో మరోసారి అధికారంలోకి వస్తాం

**న్యూ ఢిల్లీ :**ఉత్తరప్రదేశ్‌లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో కేంద్ర హోంమంత్రి అమిత్? షా శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేశారు. యూపీలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అప్పుడు రాష్ట్రంలో ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని అమలు చేస్తామని ప్రకటించారు. ఇప్పటికే దీనిని అనేక రాష్ట్రాల్లో అమలు చేస్తున్నామని వెల్లడించారు.మమ్మల్ని ఎవరూ కదిలించలేరు!ప్రస్తుతం యూపీలో బీజేపీ ప్రభుత్వం సుస్థిరంగా ఉందని, దానిని ఎవరూ కదిలించలేరని అమిత్ షా అన్నారు. "యూపీలో బీజేపీ ప్రభుత్వం అంగదుడి పాదం (కదిలించలేనిది) లాంటిది. దీనిని ఎవరూ

### మూసీ ప్రక్షాళనకు మేము

## వ్యతిరేకం కాదు

- గాంధీ సరోవరం పేరిట పేదల ఇళ్లు కూల్చడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్న రాంచందర్ రావు
- కాంగ్రెస్ పార్టీ తమపై తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపణ

**హైదరాబాద్ :**మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టును బీజేపీ అడ్డుకుంటోందని కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు మండిపడ్డారు. మూసీ ప్రక్షాళనను తమ పార్టీ వ్యతిరేకించడం లేదని, అయితే 'గాంధీ సరోవరం' పేరిట పేదల ఇళ్లను కూల్చివేయడాన్ని మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఈరోజు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాంచందర్ రావు మాట్లాడారు. పేదల ఇళ్లకు ఎలాంటి నష్టం జరగకుండా మూసీని శుభ్రపరిచే ప్రణాళికలు ప్రభుత్వం సిద్ధం చేయాలని సూచించారు. ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు ఇవ్వ డానికి నిధులు లేవని చెబుతున్న ప్రభుత్వం, మూసీ ప్రక్షాళన పేరు తో వేల కోట్లు ఖర్చు చేయడానికి సిద్ధమవ్వడం విచిత్రంగా ఉందన్నారు. ఈ ప్రాజెక్టుకు ఇంత పెద్ద మొత్తం లో నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయని ఆయనంచారు.

### ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడితే

## ఉపేక్షించం

**హైదరాబాద్, అక్టోబరు 30 :** ప్రభుత్వ భూముల పరిరక్షణలో రాజీ పడేది లేదని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. కంచె గచ్చిబౌలి నుంచి మియాపూర్ వరకు ప్రభుత్వానికి దక్కిన వరుస న్యాయ విజయాలని పేర్కొన్నారు. కంచె గచ్చి బౌలిలో 400 ఎకరాల భూమిపై సుప్రీంకోర్టులో ప్రభుత్వానికి అనుకూల తీర్పు వచ్చిందని వెల్లడించారు. హైదరాబాద్‌లో ఈరోజు (శుక్రవారం) మీడియాతో మంత్రి పొంగులేటి మాట్లాడారు.తాజాగా మియాపూర్ భూముల విషయంలోనూ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో విజయం వరించిందని తెలిపారు.దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ వివాదాల పరిష్కారంపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారని పేర్కొన్నారు. రెవెన్యూ, న్యాయశాఖ, ప్రభుత్వ న్యాయవాదుల మధ్య సమన్వయంతో న్యాయపోరాటం చేస్తున్నామని చెప్పుకొచ్చారు. పాత భూ రికార్డులు, రెవెన్యూ ఆధారాల పరిశీలనతో ప్రభుత్వ హక్కుల పరిరక్షిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములు రాష్ట్ర ప్రజల ఉమ్మడి ఆస్తి అని ఉద్ఘాటించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

### పనిలేక తిరుగుతున్నానా?

## రేవంత్ సర్కార్‌ను కూల్చేదాకా ఆగను

- జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ తరలింపు కోసం ఈటల పాదయాత్ర
- ప్రభుత్వాన్ని కూల్చే వరకు తన యాత్ర ఆగదని హెచ్చరిక
- నిధులు తేలేకపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్

**జవహర్‌నగర్:** జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌ను తరలించాలనే డిమాండ్‌తో బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేపట్టిన పాదయాత్ర ఉద్రిక్తంగా సాగుతోంది. ఈ క్రమంలో ఆయన రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేవలం డంపింగ్ యార్డ్ తరలింపు వరకే కాదు, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే వరకు తన యాత్ర ఆగదని ఆయన హెచ్చరించారు.పనిలేక తిరుగుతున్నానంటూ కాంగ్రెస్ నేతలు చేస్తున్న విమర్శలపై ఈటల ఘాటుగా స్పందించారు. "డంపింగ్ యార్డ్ తొలగింపు కోసం నేను పాదయాత్ర చేస్తుంటే, ఈటల రాజేందర్‌కు పనిలేక తిరుగుతున్నాడని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. కేవలం డంపింగ్ యార్డ్ తరలించేదాకా మాత్రమే కాదు.. మీ ప్రభుత్వం కూలిపోయే వరకు నేను తిరుగుతానే ఉంటా" అని ఆయన స్పష్టం చేశారు.జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ రీసైక్లింగ్ కోసం అయ్యే ఖర్చుపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) సిద్ధం చేయాలని ఈటల డిమాండ్ చేశారు. నివేదిక ఇస్తే, ప్రధానమంత్రి మోదీని ఒప్పించి అవసరమైన నిధులను తానే తీసుకొస్తానని ప్రకటించారు.

### ఫార్ములా ఈ రేసు కేసు.. విచారణకు

## హాజరు కాని కేటీఆర్

**- డిసెంబర్ 4కు వాయిదా**

హైదరాబాద్: సంచలనం సృష్టించిన ఫార్ములా ఈ కార్ రేస్ కేసు విచారణ వాయిదా పడింది. నాంపల్లి ఏసీబీ (ఇంటి) ప్రత్యేక కోర్టులో విచారణకు సంబంధించి సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, హెచ్ఎండీఏ (ఎఎజిణా) మాజీ చీఫ్ ఇంజినీర్ బి.ఎల్.ఎన్. రెడ్డి కోర్టుకు హాజరయ్యారు. అయితే కేసులో మరో నిందితుడైన ఫ్లోర్ట్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వర రావు విచారణ ప్రారంభ సమయానికి హాజరుకాకపోవడాన్ని కోర్టు తీవ్రంగా పరిగణించింది. సమయానికి విచారణకు హాజరుకాని కారణంగా కిరణ్ మల్లేశ్వరరావుపై ఏసీబీ కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ (ఎన్‌బీడబ్ల్యూ) జారీ చేసింది. ఆ తర్వాత ఆయన కొంత ఆలస్యంగా కోర్టుకు చేరుకోవడంతో, జారీ అయిన వారెంట్‌ను రీకాల్ చేయాలని కోరుతూ ఆయన తరపు న్యాయవాది పిటిషన్ దాఖలు చేసేందుకు సిద్ధమయ్యారు. మరోవైపు, ఈ కేసులో నిందితుడిగా ఉన్న బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ (ఖు=) వ్యక్తిగత ఇతర కారణాల వల్ల కోర్టుకు హాజరుకాకపోవడంతో ఆయన న్యాయవాది ఆబ్సెంట్ (హాజరు మినహాయింపు) పిటిషన్ దాఖలు చేశారు. ఫార్ములా ఈ రేసు కేసు విచారణలో భాగంగా దాఖలైన డిశ్చార్జ్ పిటిషన్‌పై కూడా కోర్టులో వాదనలు జరిగాయి. ఈ డిశ్చార్జ్ పిటిషన్‌పై తమ కౌంటర్ దాఖలు చేయడానికి ఏసీబీ తరపు న్యాయవాదులు మరికొంత సమయం కావాలని కోర్టును అభ్యర్థించారు. శుక్రవారం నాడు ఇరుపక్షాల వాదనలు విన్న తరువాత ఏసీబీ న్యాయస్థానం తదుపరి విచారణను డిసెంబర్ 4వ తేదీకి వాయిదా వేసింది.

### హైదరాబాద్‌కు జనవరి నుంచి 8 నెలల పాటు

## భారీ నీటి కష్టాలు

**హైదరాబాద్ :**హైదరాబాద్ నగరానికి 8 నెలల పాటు తీవ్ర నీటి కష్టాలు తప్పవని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి స్పష్టం చేశారు. మంజీరా, సింగూరు జలాశయాలు అడుగంటిపోవడంతో సుమారు రోజుకు 100 మిలియన్ గ్యాలన్ల నీటి కొరత ఏర్పడనుందని ఆయన తెలిపారు. ఈ ప్రభావం వచ్చే ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ వరకు ఉంటుందని హెచ్చరించారు.ప్రాజెక్టుల్లో నీటి మట్టాలు పడిపోవడం, భూగర్భ జలాలు తగ్గడంతో సమస్య తీవ్రంగా మారిందని అశోక్ రెడ్డి వివరించారు. ఈ కొరతను అధిగమించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

### నవంబర్ 30న ఏపీ, తెలంగాణ ఓటర్ల తుది జాబితా..

## మళ్లీ మారిన షెడ్యూల్

- ఏపీ, తెలంగాణలో మళ్లీ మారిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ షెడ్యూల్
- రెండు రాష్ట్రాల్లోనూ నవంబర్ 30న ఓటర్ల తుది జాబితా వెల్లడి
- సీఈవోల విజ్ఞప్తి మేరకు షెడ్యూల్‌ను మార్చిన కేంద్ర ఎన్నికల సంఘం

**న్యూ ఢిల్లీ :**తెలంగాణలో నవంబర్ 26, ఏపీలో నవంబర్ 20 వరకు పొడిగించిన అభ్యంతరాల గడువుతెలంగాణలో 2.59 కోట్లు, ఏపీలో 42.55 లక్షల ఓటర్ల పేర్లకు తుది జాబితాలో చోటురెండు తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమ షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) మరోసారి మార్పు చేసింది. రెండు రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారుల (సీఈవోలు) విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. తాజా మార్పులతో రెండు రాష్ట్రాల్లోనూ ఓటర్ల తుది జాబితా నవంబర్ 30వ తేదీన ప్రచురితం కానుంది.

## అర్నబ్ తుపాన్ బీభత్సం

**- రాష్ట్రాన్ని సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు సీఎం చర్యలు**

**అమరావతి:** అర్నబ్ తుపాన్ బీభత్సం నుంచి రాష్ట్రాన్ని సాధారణ స్థితికి తీసు కొచ్చేందుకు ప్రభుత్వం యుద్ధప్రాతి పదికన చర్యలు చేపట్టింది. తుపాన్ ప్రభావం మొదలైనప్పటి నుంచి నాలుగు రోజులుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతర పర్యవేక్షణ, క్షేత్ర స్థాయి పర్యటనతో సహాయక చర్యలను వేగవంతం చేసున్నారు. పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు పర్యటనకు బయలుదేరే ముందు కూడా అధికారులతో మరోసారి సమీక్ష నిర్వహించి విద్యుత్, రహదారులు, సమాచార వ్యవస్థల పునరుద్ధరణలో పురోగతిని తెలుసుకున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి విద్యుత్ సిబ్బందిని రప్పించి సరఫరా పునరుద్ధరణను వేగవంతం చేశారు.

# రైతుల రెవెన్యూ సమస్యలపై అసిస్టెంట్ కలెక్టర్ ఆరా

● షాపూర్‌లో గ్రామసభ నిర్వహణ.. భూ సమస్యలు, పట్టాదారు పాస్‌బుక్కులు, భూభారతిపై రైతులతో ముఖాముఖి

**విశాల జ్యోతి -- నందిపేట్:** నందిపేట్ మండలం షాపూర్ గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ కలెక్టర్, ఇన్‌చార్జి తహసీల్దార్ పామూరి సురేష్ హాజరై రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భూ సంబంధిత సమస్యలు, పట్టాదారు పాస్ బుక్కులు, భూభారతి దరఖాస్తులు, భూ రికార్డుల్లో నెలకొన్న ఇబ్బందులు తదితర అంశాలపై రైతుల నుంచి వివరాలు సేకరించారు. రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగకుండా గ్రామస్థాయిలోనే రైతుల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ కలెక్టర్ హామీ ఇచ్చారు. రెవెన్యూ అధికారులు నేరుగా గ్రామానికి వచ్చి రైతులతో ముఖాముఖి మాట్లాడటంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ అమంతు లక్ష్మణ్, గ్రామ సర్పంచ్ ఎర్రం హన్మండ్లు, ఉప సర్పంచ్ నీరడి రాములు, గ్రామ పంచాయతీ అధికారి (జీపీఓ), రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి

● వ్యవసాయంలో ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాలి.. నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలి: ఆర్మూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్

**ఆర్మూర్:** ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాల తగ్గుదల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆర్మూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్ సూచించారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ ప్రణాళికలు రూపొందించుకోవాలని, వ్యవసాయాధికారుల సలహాలు, సూచనల మేరకు పంటల సాగుపై నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భ జలమట్టాలు గణనీయంగా తగ్గిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటిని ప్రధానంగా తాగు నీటి అవసరాల కోసం వినియోగించాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయని తెలిపారు. రానున్న రోజుల్లో నీటి కొరత మరింత తీవ్రతరం అయ్యే అవకాశాలున్నందున ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరని పేర్కొన్నారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా, పశువులు, ఇతర మూగజీవాలకు నీటి ఎద్దడి రాకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. రైతులు ప్రస్తుత పరిస్థితులను అంచనా వేసి వ్యవసాయాధికారుల సూచనల మేరకు పంటల సాగు చేపట్టాలని, నీటి లభ్యతకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని సాయిబాబా గౌడ్ విజ్ఞప్తి చేశారు. రైతు సంక్షేమమే వ్యవసాయ అభివృద్ధికి పునాది.

రైతు బాగుంటేనే వ్యవసాయం బాగుంటుందని, వ్యవసాయం బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. రైతులు ముందు చూపుతో వ్యవహరిస్తూ నీటి వనరుల పరిరక్షణకు సహకరించాలని కోరారు.

# పోలీస్ స్టేషన్ పనితీరుపై విద్యార్థులకు అవగాహన

● ఆర్మూర్ పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం.. పోలీసుల విధులు, బాధ్యతలను వివరించిన సీఐ చంద్రశేఖర్ రెడ్డి

**విశాల జ్యోతి -- ఆర్మూర్:** విద్యార్థుల్లో పోలీస్ శాఖ పనితీరుపై అవగాహన పెంపొందించడంతో పాటు, పోలీసు సేవలు, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్రను తెలియజేసేందుకు ఆర్మూర్ పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. సీఐ చంద్రశేఖర్ రెడ్డి పర్యవేక్షణలో ఆర్మూర్‌లోని క్షత్రియ పాఠశాల విద్యార్థులు పోలీస్ స్టేషన్‌ను సందర్శించగా, అధికారులు వారికి పోలీస్ శాఖ విధులు, బాధ్యతలు, రోజువారీ కార్యకలాపాల గురించి వివరించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రిసెప్షన్ డెస్క్ నుంచి వివిధ విభాగాల వరకు విద్యార్థులను తీసుకెళ్లి వాటి పని తీరును పరిచయం చేశారు. పోలీస్ శాఖలోని వివిధ హోదాలు, అధికారుల యూనిఫామ్‌పై ఉండే స్టార్లు, బ్యాడ్జీలు, వాటి ప్రాధాన్యతను వివరించారు. సీఐ, ఎస్ఐ, ఏఎస్ఐ తదితర అధికారుల విధులు, పోలీస్ సిబ్బంది నిర్వహించే బాధ్యతలు, ప్రజలకు అందించే సేవల గురించి అవగాహన కల్పించారు. అలాగే రోడ్లపై ప్రయాణించే సమయంలో అంధులు, వృద్ధులు, ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని విద్యార్థులకు సూచించారు. సమాజంలో శాంతిభద్రతలను కాపాడటంలో పోలీసుల పాత్రతో పాటు ప్రజల సహకారం కూడా ఎంతో ముఖ్యమని వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సీఐ చంద్రశేఖర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది ఓపికగా సమాధానాలు ఇచ్చారు. పోలీస్ స్టేషన్‌లో జరిగే రోజువారీ కార్యకలాపాలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం విద్యార్థుల్లో ఆసక్తిని కలిగించింది. పోలీస్ వ్యవస్థపై అపోహలు తొలగించి, పోలీసు సేవల పట్ల గౌరవం, అవగాహన పెంపొందించడమే ఓపెన్ హౌస్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు.

# జిల్లా ఖో-ఖో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా కానూరి గంగా సాగర్ ఎన్నిక

●నందిపేట్, డొంకేశ్వర్ ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘన సన్మానం

**నిజామాబాద్ జిల్లా:** నిజామాబాద్ జిల్లా ఖో-ఖో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా కానూరి గంగా సాగర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నందిపేట్, డొంకేశ్వర్ మండలాల ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ (ట్రూటా) ప్రతినిధులు ఆయనను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గంగా సాగర్‌కు పూలమాల వేసి, శాలువాతో సన్మానించారు. జిల్లా స్థాయి క్రీడా సంఘంలో వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఖో-ఖో క్రీడ అభివృద్ధికి, గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆయన తన వంతు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు, పలువురు ప్రముఖులు పాల్గొని గంగా సాగర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో క్రీడా రంగంలో మరిన్ని ఉన్నత బాధ్యతలు చేపట్టి జిల్లా ఖ్యాతిని పెంచాలని ఆకాంక్షించారు.

# రక్తదానం ప్రాణదానంతో సమానం

● జిల్లా ఎస్పీ రోహిత్ రాజు
●పోలీస్ అమరవీరుల సంస్మరణోత్సవాల్లో భాగంగా మెగా రక్తదాన శిబిరం

**భద్రాద్రి కొత్తగూడెం(విశాల జ్యోతి):** రక్తదానం ప్రాణదానంతో సమానమని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం కొత్తగూడెం క్లబ్‌లో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి సేవలను ప్రజలకు తెలియజేసే ఉద్దేశంతో జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా సైకిల్ ర్యాలీ బైక్ ర్యాలీ వ్యాసరచన పోటీలు ఓపెన్ హౌస్ కార్యక్రమాలతో పాటు అన్ని సబ్ డివిజన్ల పరిధిలో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రక్తదానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు అత్యవసర సమయాల్లో రక్తం ఎంతమందికి ప్రాణదానం చేయగలదనే విషయాలను వివరిస్తూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేయడం సమాజానికి అందించే గొప్ప సేవ అని పేర్కొన్నారు. ఈ మెగా రక్తదాన శిబిరంలో విద్యార్థులు యువకులు మహిళలు రాజకీయ ప్రముఖులు పోలీస్ అధికారులు సిబ్బంది దివ్యాంగులు తదితరులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారిని ఎస్పీ అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు.

అనంతరం వారికి పండ్లు పండ్ల రసాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎంహెచ్ఓ తుకారం రాథోడ్, కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, సీఐలు వెంకటేశ్వర్లు, శ్రీలక్ష్మి, జితేందర్, యాసిన్, ఇంద్రసేనారెడ్డి, కరుణాకర్,

నరేష్, ఆర్ఐలు రవి, లాల్‌బాబు, కృష్ణారావు, పోలీస్ అధి కారులు, సిబ్బంది, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో బియ్యం బ్లాక్ దందా

● ప్రజా సమస్యపై ప్రత్యేక కథనం
వడ్ల ధరల పెరుగుదల సాకుతో బియ్యం ధరలకు రెక్కలు.. సామాన్యుడి జేబుకు చిల్లు!
● గోదాముల్లో ధాన్యం నిల్వ.. మార్కెట్‌లో కృత్రిమ కొరతకు తెరలేపుతున్నారా?
● మిల్లింగ్ చేయకుండా ధాన్యం దాచిపెడుతున్న కొందరు రైస్‌మిల్లర్లు? భవిష్యత్తులో భారీ ధరలకు విక్రయించే వ్యూహమా?
● తక్కువ ధరకు బియ్యం అమ్మితే బెదిరింపులా? వ్యాపారుల సిండికేట్‌పై తీవ్ర ఆరోపణలు!
● నందిపేట్, డొంకేశ్వర్‌లో ఏం జరుగుతోంది? కలెక్టర్ ఇలాత్రిపాఠి ప్రత్యేక దృష్టి సారించాలి!

**నిజామాబాద్, అక్టోబర్ 30:** రైతు పండించిన ధాన్యానికి ధర పెరిగితే సంతోషించాల్సిందే కానీ ఆ పేరుతో సామాన్యుడి వంటింట్లో మంటలు పెట్టడం ఎంతవరకు సమంజసం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో బియ్యం ధరలు సామాన్యులకు భారంగా మారుతున్నాయి. వడ్ల ధరలు పెరిగాయనే సాకుతో బియ్యం ధరలను అమాంతం పెంచుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో క్వింటాలు రూ.4 వేల నుంచి రూ.6 వేల మధ్య ఉన్న బియ్యం ధరలు ప్రస్తుతం కొన్ని రకాల విషయంలో రూ.10 వేల వరకు చేరుతున్నాయనే వాదనలు మార్కెట్‌లో కలకలం రేపుతున్నాయి. ఇక్కడితో వ్యవహారం ఆగడం లేదు. కొందరు రైస్‌మిల్లుల యజమానులు ధాన్యాన్ని బియ్యంగా మార్చకుండా గోదాముల్లోనే నిల్వ ఉంచుతున్నారనే సమాచారం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. మార్కెట్‌లోకి బియ్యం సరఫరాను తగ్గించి, భవిష్యత్తులో ధరలు పెరిగినప్పుడు విక్రయించాలనే వ్యూహం ఏమైనా ఉందా? అసలు ధాన్యం నిల్వల వెనుక ఉన్న మర్మమేమిటి వ్యాపారుల మధ్య కుమ్మక్కు ఉందా అన్న ప్రశ్నలు ఇప్పుడు ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి.

**వడ్ల ధర పెరిగిందని.. పాత బియ్యానికీ కొత్త ధరలా?**

ప్రస్తుతం పచ్చి వడ్లను క్వింటాలుకు రూ.3 వేల నుంచి రూ.3,800 వరకు కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. రైతుకు మంచి ధర రావడం ఆహ్వానించదగిన పరిణామం. కానీ కొత్తగా కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన వ్యయాన్ని సాకుగా చూపుతూ, గతంలో తక్కువ ధరలకు కొనుగోలు చేసి నిల్వ చేసుకున్న బియ్యానికి కూడా భారీగా ధరలు పెంచడం వెనుక ఆంతర్యమేమిటి? పాత నిల్వల బియ్యానికి కొత్తగా కొనుగోలు చేసిన ధాన్యం ధరల ప్రభావం చూపడం ఎంతవరకు సమంజసం? కొనుగోలు ధరల్లో పెరుగుదల ఎంత? రవాణా, మిల్లింగ్, ఇతర ఖర్చుల ప్రభావం ఎంత? వ్యాపారుల లాభాల శాతం ఎంత? వీటిపై అధికారుల దగ్గర స్పష్టమైన లెక్కలు ఉన్నాయా? అన్న ప్రశ్నలకు సమాధానాలు కావాలి.

**గోదాముల్లో ధాన్యం.. మార్కెట్‌లో బియ్యం కొరత!**

ఈ వ్యవహారంలో అత్యంత కీలకమైన అంశం ఇదే. కొందరు రైస్‌మిల్లుల యజమానులు రైతులు, దళారుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లింగ్ చేయకుండా గోదాముల్లోనే నిల్వ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ధాన్యం అందుబాటులో ఉన్నప్పటికీ బియ్యంగా మార్చి మార్కెట్‌కు ఎందుకు విడుదల చేయడం లేదు రానున్న రోజుల్లో ధరలు మరింత పెరుగుతాయనే అంచనాతో ధాన్యాన్ని నిల్వ ఉంచుతున్నారా తగిన సమయంలో మిల్లింగ్ చేసి అధిక ధరలకు విక్రయించాలనే వ్యాపార వ్యూహమా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇదే నిజమైతే మార్కెట్‌లో సరఫరా తగ్గి కృత్రిమ కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. ధాన్యం గోదాముల్లో ఉండగా వినియోగదారుడు మాత్రం అధిక ధరలకు బియ్యం కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అయితే ఈ ఆరోపణలు వాస్తవమా లేక మిల్లింగ్ సామర్థ్యం, ఇతర వ్యాపార కారణాల వల్ల నిల్వలు కొనసాగుతున్నాయా అనేది అధికారుల తనిఖీల్లో తేలాల్సి ఉంది. మిల్లుల వారీగా ధాన్యం నిల్వలు, మిల్లింగ్ వివరాలు, బియ్యం ఉత్పత్తి, విక్రయాల గణాంకాలను బహిర్గతం చేయాల్సిన అవసరం అధికారులపై ఉంది.

**సిండికేట్ గుప్పిట్లో బియ్యం మార్కెట్?**

మార్కెట్‌లో వ్యాపారుల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండాలి. ఎవరు తక్కువ ధరకు నాణ్యమైన బియ్యం విక్రయించినా వినియోగదారులకు ప్రయోజనం కలగాలి. కానీ కొన్ని ప్రాంతాల్లో తక్కువ ధరకు బియ్యం విక్రయించే వ్యాపారులపై ఒత్తిళ్లు, బెదిరింపులు వస్తున్నాయనే ఆరోపణలు పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నాయి. వ్యాపారులంతా ఒకే ధరకు విక్రయించాలనే ఒత్తిడి వెనుక ఎవరున్నారు ధరలను ఎవరు నిర్ణయిస్తున్నారు స్వేచ్ఛగా వ్యాపారం చేసుకునే పరిస్థితి ఉందా అనే అంశాలపై విచారణ జరగాలి. మార్కెట్‌లో సిండికేట్ కార్యకలాపాలు ఉన్నాయనే ఆరోపణలు నిజమైతే వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందే.

**నందిపేట్, డొంకేశ్వర్‌పైనే ప్రత్యేక దృష్టి!**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో బియ్యం ధరల వ్యవహారంపై చర్చ జరుగుతుండగా నందిపేట్, డొంకేశ్వర్ మండలాల పరిస్థితి ప్రత్యేకంగా ప్రస్తావనకు వస్తోంది. ఈ ప్రాంతాల్లోని బియ్యం వ్యాపారులు, రైస్‌మిల్లులు, హోల్‌సేల్ గోదాముల నిల్వలు, విక్రయ ధరలపై ప్రజల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తక్కువ ధరకు విక్రయించే వ్యాపారులపై ఒత్తిళ్లు తెస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ రెండు మండలాల్లో ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహిస్తే వాస్తవ పరిస్థితి వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

**ఎల్నినో భయంతో ముందస్తు నిల్వలా?**

వాతావరణ మార్పులు, ఎల్నినో ప్రభావం, భవిష్యత్తులో దిగుబడులపై అనిశ్చితి వంటి అంశాలను కొందరు వ్యాపారులు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. భవిష్యత్తులో ధరలు పెరుగుతాయనే అంచనాతో ధాన్యం, బియ్యం నిల్వలను పెంచుకుంటున్నారా? అన్న కోణంలోనూ అధికారులు పరిశీలించాలి. నిల్వలు చేసుకోవడం ఒక వ్యాపార విధానం కావచ్చు. కానీ సరఫరాను ఉద్దేశపూర్వకంగా అడ్డుకుని కృత్రిమ కొరత సృష్టించడం మాత్రం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధం.

**అధికారులు నిద్రావస్థలో ఉన్నారా?**

బియ్యం ధరలు పెరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నా సంబంధిత శాఖల నుంచి స్పష్టమైన స్పందన కనిపించడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని రైస్‌మిల్లుల్లో ఎంత ధాన్యం ఉంది ఎంత మిల్లింగ్ చేస్తున్నారు ఎంత బియ్యం మార్కెట్‌కు వస్తోంది పాత నిల్వల కొనుగోలు ధరలు, ప్రస్తుత విక్రయ ధరల మధ్య వ్యత్యాసం ఎంత వ్యాపారుల మధ్య ధరల ఒప్పందాలు ఏమైనా ఉన్నాయా అనే అంశాలపై అధికారులు సమగ్రంగా ఆరా తీయాలి.

**కలెక్టర్ ఇలాత్రిపాఠి స్పందించాలి!**

జిల్లా కలెక్టర్ ఇలాత్రిపాఠి ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. పౌరసరఫరాల శాఖ, రెవెన్యూ, తూనికలు-కొలతల శాఖ అధికారులతో ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేయాలి. ముఖ్యంగా నందిపేట్, డొంకేశ్వర్ మండలాల్లోని రైస్‌మిల్లులు, గోదాములు, హోలసేల్, రిటైల్ దుకాణాలను తనిఖీ చేయాలి. ధాన్యం కొనుగోలు రికార్డులు, నిల్వలు, మిల్లింగ్ వివరాలు, బియ్యం సరఫరా, విక్రయ ధరలను పరిశీలించాలి. అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత లేదా వ్యాపారుల మధ్య అక్రమ ఒప్పందాలు ఉన్నట్లు ఆధారాలు లభిస్తే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.

**రైతు పేరుతో వ్యాపారుల లాభాలా? సామాన్యుడికి న్యాయం ఎప్పుడు?**

రైతుకు గిట్టుబాటు ధర రావాలి.. వినియోగదారుడికి అందుబాటు ధరలో బియ్యం దొరకాలి. ఈ రెండింటి మధ్య సమతుల్యతను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉంది. రైతు కష్టాన్ని సాకుగా చూపి వ్యాపారులు అదనపు లాభాలు పొందుతున్నారనే ఆరోపణలు నిజమైతే అది తీవ్రంగా పరిశీలించాల్సిన అంశం. గోదాముల్లో ధాన్యం నిల్వలు, మిల్లింగ్ ప్రక్రియ, మార్కెట్ సరఫరా, వ్యాపారుల ధరల వ్యవహారాలపై సమగ్ర విచారణ జరిగితేనే అసలు బాగోతం బయటపడుతుంది. ధాన్యం గోదాముల్లో ఉండాలి.. బియ్యం సామాన్యుడి ఇంట్లో ఉండాలి! కానీ ధాన్యం నిల్వల పేరుతో మార్కెట్‌లో కొరత సృష్టించి, ధరల పేరుతో ప్రజల జేబులకు చిల్లు పెడితే చూస్తూ ఊరుకునే పరిస్థితి ఉండకూడదు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయిలోకి దిగి వాస్తవాలను వెలికితీస్తుందా బియ్యం ధరల బాదుడుకు అడ్డుకట్ట వేస్తుందా అన్నది వేచి చూడాలి.

# చలో ఢిల్లీ.. ఆర్మూర్ బాల్కొండ నుంచి కాంగ్రెస్ శ్రేణుల తరలింపు

- రాహుల్ గాంధీ పిలుపుతో నవంబర్ 1న రాంలీలా మైదానంలో ఓట్ చోరీకి వ్యతిరేకంగా భారీ నిరసన
- పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి నాయకత్వంలో నందిపేట్, డొంకేశ్వర్ మండలాల నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఢిల్లీ బాట

**నిజామాబాద్, అక్టోబర్ 30:** లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇచ్చిన పిలుపు మేరకు నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో నిర్వహించనున్న 'ఓట్ చోరీ' వ్యతిరేక నిరసన కార్యక్రమానికి ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి నాయకత్వంలో నందిపేట్, డొంకేశ్వర్ మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు శుక్రవారం ఢిల్లీ బయలు దేరారు.కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అక్రమాలు జరిగాయంటూ కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. ఓటర్ల పేర్ల తొలగింపు, ఓటు హక్కుకు సంబంధించిన అవకతవకలపై ప్రశ్నిస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ రక్షణ లక్ష్యంగా ఈ ఉద్యమాన్ని చేపడుతున్నట్లు కాంగ్రెస్ నాయకత్వం ప్రకటించింది.

**నవంబర్ 1న రాంలీలా మైదానంలో మహా నిరసన**

రాహుల్ గాంధీ పిలుపుతో నిర్వహిస్తున్న 'చలో ఢిల్లీ -- ఓట్ బచావో, దేశ్ బచావో' జనమార్చ్, మహా ర్యాలీ నవంబర్ 1న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనుంది. ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు, కార్యకర్తలు హాజరు కానున్నారు.

**ప్రజాస్వామ్య పరిరక్షణే ప్రధాన లక్ష్యం**

ఓటరు జాబితాల్లో అవకతవకలు, అర్హులైన ఓటర్ల పేర్ల తొలగింపు, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత వంటి అంశాలను నిరసనలో ప్రధానంగా ప్రస్తావించనున్నారు. ఈ వ్యవహారంపై కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ బాధ్యత వహించాలని, ఆయన రాజీనామా చేయాలని కాంగ్రెస్, ఇండియా కూటమి డిమాండ్ చేస్తున్నాయి. అయితే ఇవి ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలు, డిమాండ్లు మాత్రమే.

**ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి కాంగ్రెస్ శ్రేణుల సమీకరణ**

ఈ నేపథ్యంలో ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల పరిధిలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఢిల్లీ నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు బయలుదేరడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి నాయకత్వంలో నందిపేట్ డొంకేశ్వర్ మండలాల నుంచి పార్టీ శ్రేణులుతరలివెళ్లడం ద్వారా జాతీయ స్థాయి నిరసనలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ తన భాగస్వామ్యాన్ని చాటుకునే ందుకు సిద్ధమైంది.

# ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి

## బీఆర్ఎస్ శ్రేణుల సమాయత్తం..

- ఉపాధ్యాయులతో మాలోత్ కవిత ఆత్మీయ భేటీ
- బీఆర్ఎస్ అభ్యర్థి విజయానికి మద్దతుగా నిలవాలని ఉపాధ్యాయులకు పిలుపు

**విశాల జ్యోతి (దంతాలపల్లి)** ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ అభ్యర్థి విజయమే లక్ష్యంగా పార్టీ నాయకత్వం ప్రచారాన్ని ముమ్మరం చేస్తోంది. ఇందులో భాగంగా దంతాలపల్లిలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల అవగాహన కార్యక్రమంలో మహబూబాబాద్ మాజీ ఎంపీ, డోర్నకల్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జ్ మాలోత్ కవిత పాల్గొన్నారు.ఈ సందర్భంగా పలు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులతో ఆమె సమావేశమై ఎమ్మెల్సీ ఎన్నికల ప్రాధాన్యతను వివరించారు. ఉపాధ్యాయుల సమస్యలపై అవగాహన కలిగి, వారి గొంతుకను మండలిలో బలంగా వినిపించే నాయకత్వానికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థికి తమ విలువైన మద్దతు అందించి విజయానికి సహకరించాలని ఉపాధ్యాయులను కోరారు.ఉపాధ్యాయ వర్గాల మద్దతుతో బీఆర్ఎస్ అభ్యర్థి విజయాన్ని సునాయాసం చేయాలని, ఎన్నికల్లో ఐక్యంగా ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి

- విద్యార్థుల విషయంలో నిర్లక్ష్యం సహించేది లేదు
- ఏకలవ్య పాఠశాలలో లోపాలపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి
- ప్రిన్సిపాల్‌కు మెమో.. వంట మనిషిని తొలగించాలని కలెక్టర్ అంకిత్ ఆదేశం

**భద్రాద్రి కొత్తగూడెం(విశాల జ్యోతి):** మారుమూల ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రుల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు కొనసాగించాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం విస్తృతంగా పర్యటించి భూ రీ సర్వే పనులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ శాఖల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు ఆదేశాలు జారీ చేశారు.అనంతరం గుండాల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ విద్యార్థులకు అందిస్తున్న విద్యా బోధన మౌలిక సదుపాయాలు పారిశుద్ధ్యం భోజన సదుపాయాలను పరిశీలించారు. తరగతి గదుల్లో విద్యార్థులు లేకపోవడాన్ని గమనించి తరగతుల సమయంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ఏమిటని ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించారు. విద్యార్థుల విద్యాభ్యాసానికే తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సాంస్కృతిక కార్యక్రమాలను సెలవు రోజుల్లో నిర్వహించుకోవాలని సూచించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు. పాఠశాల మరుగుదొడ్ల అపరిశుభ్రంగా ఉండటంపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వంటశాల స్టోర్ రూమ్‌ను పరిశీలించగా బంగాళా దుంపలు కుళ్లిపోయి ఉండటం పం చదారలో చీమలు పట్టి ఉండటాన్ని గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన వంట మనిషిని విధుల నుంచి తొలగించాలని ఆదేశించారు. విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్ సాంబార్, రసం పలుచగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆరోజు ప్రభుత్వ మెనూ ప్రకారం బిర్యానీ వడ్డించాల్సి ఉండగా అందుకు అనుగుణంగా భోజనం సిద్ధం చేయకపోవడాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని స్పష్టం చేశారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు బోధన పారిశుద్ధ్యం భోజన నాణ్యత ఆహార పదార్థాల నిల్వలో గుర్తించిన లోపాలపై ప్రిన్సిపాల్‌కు మెమో జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య పరిశుభ్రమైన వాతావరణం మెరుగైన వసతులు పౌష్టికాహారం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.గుండాల రెవెన్యూ పరిధిలో జరుగుతున్న భూ రీ సర్వే పనులను పరిశీలించిన కలెక్టర్ సర్వే పురోగతిని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మొత్తం 10,390 ఎకరాల విస్తీర్ణంలో 6,694 ఎకరాలు అటవీ భూములుగా ఉన్నాయని అటవీ శాఖ గెజిట్ ప్రకారం నిర్దేశించిన హద్దులు, ఎన్‌క్లోజర్ లేయర్ల ఆధారంగా మిగిలిన భూముల్లో సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు సుమారు 950 ఎకరాల్లో సర్వే పూర్తికాగా, అందులో 561 ఎకరాల ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించినట్లు సిబ్బంది వివరించారు. అనంతరం గుండాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ అక్కడ అందిస్తున్న వైద్య సేవలు రక్త పరీక్షలు మందుల నిల్వలు వైద్య పరికరాల లభ్యతపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. మందుల గదిని పరిశీలించగా అత్యవసర వైద్య అవసరాలకు ఉపయోగించే సిరంజీలు అందుబాటులో లేకపోవడాన్ని గుర్తించి కారణాలను ప్రశ్నించారు. ఇంటర్నెట్ సమస్యల కారణంగా మందులు వైద్య సామగ్రి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఇప్పటికే ఇండెంట్ పెట్టామని వైద్యాధికారులు వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సిరంజీలు అవసరమైన మందులు వైద్య పరికరాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు.ఈ పర్యటనలో సర్పంచ్ రాధా, తహసీల్దార్ సంగీత, ఎంపీడీవో బాలరాజు, ఎంఈఓ పార్వతి, ఎంపీవో త్రిలోక్, సర్వేయర్ శివకృష్ణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

# బిజినెస్ పార్టనర్ గా

## తానికొండ నాగేంద్ర రెడ్డి

**భద్రాద్రి కొత్తగూడెం (విశాల జ్యోతి):** బిజినెస్ పార్ట్నర్ గా తానికొండ నాగేందర్ రెడ్డికి ప్రమోషన్ రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 158 సంవత్సరాల టాటా గ్రూప్ టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో చీఫ్ బిజినెస్ లీడర్(సిబిఎ) నుండి ప్రతిష్టాత్మక పార్టనర్ ప్రమోషన్ పొందిన మొట్ట మొదటి కొత్తగూడెం జిల్లా వాసి తానికొండ నాగేంద్ర రెడ్డి. గతంలో వేలాది మంది నిరుద్యోగులకు శిక్షణ ఉపాధి అవకాశాలు కల్పించి తరువాత టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో చేరి కేవలం 4 సంవత్సరాల అనతి కాలంలోనే పార్టనర్ స్థాయికి ఎదిగారు. ఇన్సూరెన్స్ రంగంలో కూడా ఉపాధి అవకాశాలు కల్పిస్తూ వేలాది కుటుంబాలకు ఆర్థిక రక్షణ కల్పిస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కష్టపడి పనిచేసి నాయకత్వ నైపుణ్యలను నిరూపించి కస్టమర్ల విశ్వాసాన్ని గెలుచుకుని ఈ ప్రతిష్టాత్మక పార్టనర్ ప్రమోషన్ సాధించారు. ఈ స్థాయికి ఎదగడానికి సహకరించిన ఆయన టీమ్ లీడర్స్ అండ్ అడ్వైసర్స్ కి కృతజ్ఞతలు తెలిపారు.రానున్న రోజులలో వేల మంది నిరుద్యోగులకు శిక్షణ ఉపాధి అవకాశాలు కల్పిస్తానని ఆయన అన్నారు. ఆయన విజయంపై సీనియర్ పార్టనర్ సురభి ముకుంద రావు, ఎంపీబీఏ పోతురెడ్డిపల్లి రామగోపి, కంపెనీ ఎంప్లాయిస్, తోటి లీడర్స్, అడ్వైసర్స్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# సమాజానికి మంచి చేయడమే

## నిజమైన దైవ విశ్వాసం

- జమాతే ఇస్లాం హింద్ సభ్యులు షేక్ అబ్దుల్ బాసిత్

**భద్రాద్రి కొత్తగూడెం(విశాల జ్యోతి):** సాటి మానవులకు నష్టం కష్టం కలిగించకుండా మంచి చేయాలని జమాతే ఇస్లామీ హింద్ సభ్యులు షేక్ అబ్దుల్ బాసిత్ అన్నారు. పవిత్ర శుక్రవారం సందర్భంగా కొత్తగూడెం కార్పొరేషన్ లోని మేదర్ బస్తీలో మస్జిద్ ఎ వహీద్ లో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ మానవులందరూ ఒకే సృష్టి కర్త దాసులని సాటి మానవులకు సేవ చేయడమే నిజమైన ఆరాధన అని అన్నారు. సమాజానికి నష్టం వాటిల్లే పనులకు దూరంగా ఉండాలని అన్నారు. దైవాన్ని నమ్మడం అంటే సహనం దాతృత్వం నైతికోన్నత అన్న ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం బోధనలను తు.చా తప్పకుండా పాటించాలని అన్నారు. కల్తీ మద్యం జూదం అబద్ధాలు చెప్పడం లంచ ఇవ్వడం తీసుకోవడం మానవతా విలువలు లేకుండా వ్యవహరించే వారు విశ్వాసులు కాదని ప్రవక్త ముహమ్మద్ బోధించారని పేర్కొన్నారు. ఈ జీవితం ఒక పరీక్ష ఇక్కడ లభించిన ప్రతి వారానికి సమాధానం చెప్పుకోవాలన్నారు.ధనం జ్ఞానం అధికారాన్ని చూసుకుని విర్రవీగే వారిని చివరికి వినాశం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మసీదు ఇమాం మజహర్, జమాతే ఇస్లామీ హింద్ పట్టణం అధ్యక్షుడు షారుఖ్ యజ్దానిజబ్బార్ సాబ్, ముక్తార్, షరీఫ్ బాయ్, నయీం ఖురైషీ, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పోలీస్ శాఖ పనితీరుపై అవగాహన

## బాలికల భద్రతకు ప్రత్యేక బోధన

- నందిపేట్ పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం.. పోలీసుల విధులు, ఆధునిక సాంకేతిక పరికరాలపై ప్రత్యక్ష వివరణ
- పోలీస్ అక్క కార్యక్రమంతో బాలికలకు భద్రతపై దిశానిర్దేశం.. ఆపదలో డయల్ 112కు కాల్ చేయాలని సూచన

**విశాల జ్యోతి -- నందిపేట్:** పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా నందిపేట్ పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించడంతో పాటు, పాఠశాలల్లో బాలికల భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు నందిపేట్ ఎస్ఐ కె. వినయ్ తెలిపారు.

పోలీస్ స్టేషన్ పనితీరుపై ప్రత్యక్ష అవగాహన నందిపేట్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన ఓపెన్ హౌస్ కార్యక్రమానికి కృష్ణవేణి, అక్షర పాఠశాలలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీసుల రోజువారీ విధులు, బాధ్యతలు, ఫిర్యాదుల స్వీకరణ, కేసుల దర్యాప్తు తదితర అంశాలను వివరించారు.అలాగే పోలీస్ శాఖలో వినియోగించే వీహెచ్ఎఫ్ కమ్యూనికేషన్ సెట్, వేలిముద్రల సేకరణ యంత్రం, సీసీటీఎన్ఎస్ (జజుచీూ) నెట్‌వర్క్ పనితీరును విద్యార్థులకు ప్రత్యక్షంగా చూపించి, వాటి ప్రాధాన్యతను వివరించారు.

బాలికల భద్రతపై పోలీస్ అక్క అవగాహన

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ఆదేశాల మేరకు పోలీస్ అక్క కార్యక్రమంలో భాగంగా నందిపేట్ పోలీస్ స్టేషన్ మహిళా సిబ్బంది చోడమ్మ కొండూరు జెడ్పీహెచ్ఎస్, నందిపేట్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా 7, 8, 9, 10వ తరగతుల బాలికలకు వ్యక్తిగత భద్రత, స్వీయ రక్షణ, అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తత, వేధింపులు లేదా ఇతర సమస్యలు ఎదురైనప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు.అత్యవసర పరిస్థితుల్లో భయపడకుండా వెంటనే పోలీసుల సహాయం పొందాలని, ఆపద సమయంలో డయల్ 112కు ఫోన్ చేయాలని సూచించారు. తమకు ఎదురయ్యే సమస్యలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల దృష్టికి నిర్భయంగా తీసుకురావాలని అవగాహన కల్పించారు.విద్యార్థుల్లో పోలీస్ శాఖపై అవగాహన పెంపొందించడంతో పాటు, బాలికలు తమ భద్రత పట్ల అప్రమత్తంగా ఉండేలా చేయడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని ఎస్ఐ కె. వినయ్ తెలిపారు.

# ఎల్నినో ప్రభావంపై ముందస్తు అప్రమత్తత

## నిత్యావసర సరుకుల నిల్వలపై కలెక్టర్ సమీక్ష

- 30--45 రోజుల సరుకుల నిల్వలు తప్పనిసరి.. కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు
- ధరల పెరుగుదల, బ్లాక్ మార్కెటింగ్‌పై నిఘా.. ప్రజలు ఆందోళనతో అధికంగా కొనుగోళ్లు చేయ వద్దని సూచన

**కామారెడ్డి:** ఎల్నినో ప్రభావంతో భవిష్యత్తులో వ్యవసాయ ఉత్పత్తులు, ఆహార సరుకుల సరఫరాపై ప్రతికూల పరిస్థితులు ఏర్పడే అవకాశాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ముందస్తు అప్రమత్తత చర్యలకు శ్రీకారం చుట్టింది. నిత్యావసర సరుకుల లభ్యత, పప్పుధాన్యాల నిల్వలు, మార్కెట్ ధరల నియంత్రణపై కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సంబంధిత అధికారులతో పాటు వ్యాపార సంఘాల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

45 రోజుల నిల్వలు ఉండాల్సిందే!

మార్కెట్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా కనీసం 30 నుంచి 45 రోజుల పాటు సరిపడా నిత్యావసర సరుకుల నిల్వలను వ్యాపారులు అందుబాటులో ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. భవిష్యత్తులో సరుకుల సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో పప్పు ధాన్యాలు సహా ఇతర నిత్యావసర వస్తువుల లభ్యతపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని స్పష్టం చేశారు. బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలుఎల్నినో ప్రభావాన్ని సాకుగా చూపుతూ నిత్యా వసర సరుకుల ధరలను కృత్రిమంగా పెంచడం, సరుకులను అక్రమంగా నిల్వ చేయడం, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడటం వంటి చర్యలను సహించబోమని కలెక్టర్ హెచ్చరించారు. మార్కెట్లలో అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని, వ్యాపారుల వద్ద నిల్వల రిజిస్టర్లు, కొనుగోలు, విక్రయ బిల్లులను పరిశీలించాలని ఆదేశించారు. ధరల నియంత్రణతో పాటు సరుకుల సరఫరాలో పారదర్శకత ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రజలు ఆందోళన చెందవద్దు

జిల్లాలో నిత్యావసర సరుకుల కొరత ఏర్పడకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. ప్రజలు అనవసర భయాందోళనలకు గురై అవసరానికి మించి సరుకులు కొనుగోలు చేయవద్దని సూచించారు. సరుకుల కృత్రిమ కొరతకు ఆస్కారం లేకుండా అధికారులు, వ్యాపారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక వ్యాపార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కళా ప్రతిభకు వేదికగా నిలిచిన 'సాధన 2026'

### గీతం యూనివర్సిటీలో ప్రతిభ చాటిన విద్యార్థులు

**పటాన్చెరు అక్టోబర్ 30, (విశాలజ్యోతి),** విద్యార్థుల కళా నైపుణ్యాలు, సృజనాత్మక వ్యక్తీకరణకు వేదికగా హైదరాబాద్ గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ లో 'సాధన 2026' కార్యక్రమం ఘనంగా జరిగింది. లలిత మరియు ప్రదర్శన కళల విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం డాన్స్ స్టూడియోలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు ఐచ్ఛిక కోర్సులుగా నేర్చుకుంటున్న కర్ణాటక సంగీతం, భరతనాట్యం, కూచిపూడి, నాటకం, దృశ్య కళలలో తమ ప్రగతిని ప్రదర్శించారు. అధ్యాపకుల పర్యవేక్షణలో విద్యార్థులు బృందాలుగా ఏర్పడి తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. ఈ సంగీత ప్రదర్శనలకు మృదంగంపై చంద్రకాంత్, వయోలిన్ పై వాసు శాస్త్రి సహకారం అందించారు. లైవ్ వాయిద్య సహకారంతో విద్యార్థులకు ప్రత్యక్షంగా ప్రదర్శన ఇచ్చే అవకాశం కల్పించడం ఈ కార్య క్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇది విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, స్టేజ్ పై పెర్ఫార్మెన్స్ నైపుణ్యాలను పెంపొందించింది. ఈ కార్యక్రమం విద్యార్థులకు తమ కళా ప్రస్థానంలో తొలి వేదిక అనుభవాన్ని అందించడమే కాకుండా, మధ్యంతర మూల్యాంకనంలో భాగంగా కూడా నిలిచింది. విద్యార్థుల ప్రదర్శనలు అధ్యాపక బృందం, తోటి విద్యార్థుల నుంచి ప్రశంసలు అందుకున్నాయి.

అనుభవపూర్వక అభ్యసనం ద్వారా తదుపరి తరం కళాకారులను ప్రోత్సహించడమే తమ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

## రేపు నిజామాబాద్ నగరంలో

### తాగునీటి సరఫరా బంద్

- అలీసాగర్ ఫిల్టర్ బెడ్ వద్ద 900 ఎంఎం పైప్‌లైన్‌కు లీకేజీ.. మరమ్మతుల నేపథ్యంలో సరఫరా నిలిపివేత
- ప్రజలు ముందుగానే నీటిని నిల్వ చేసుకోవాలి: మున్సిపల్ కార్పొరేషన్ ఏఈఈ సల్మాన్

**నిజామాబాద్:** నగర ప్రజలకు తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది. అలీసాగర్ ఫిల్టర్ బెడ్ వద్ద 900 ఎంఎం బీడబ్ల్యూఎస్సీ (దీఔాజ) ప్రధాన పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడటంతో మరమ్మతు పనులు చేపట్టారు. ఈ పనుల నేపథ్యంలో శనివారం (అక్టోబర్ 31) నిజామాబాద్ నగరంలో తాగునీటి సరఫరాను నిలిపివేయనున్నట్లు మున్సిపల్ కార్పొరేషన్ ఏఈఈ సల్మాన్ వెల్లడించారు. పైప్‌లైన్ లీకేజీని సరిచేసేందుకు అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు కొనసాగిస్తున్నారు. ప్రధాన పైప్‌లైన్ కావడంతో మరమ్మతు పనులు పూర్తయ్యే వరకు నీటి సరఫరా సాధ్యం కాదని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో నగర ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈఈ సూచించారు. శనివారం అవసరాలకు సరిపడా నీటిని ముందుగానే నిల్వ చేసుకోవడంతో పాటు, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని కోరారు. మరమ్మతు పనులు పూర్తయ్యే వరకు నీటి వినియోగంలో జాగ్రత్తలు పాటిస్తూ, మున్సిపల్ అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు సూచన: నీటి సరఫరా నిలిచిపోనున్న నేపథ్యంలో తాగునీరు, వంట అవసరాలు, ఇతర గృహావసరాలకు సరిపడా నీటిని ముందుగానే సమకూర్చుకోవాలి.

## చామంతి రైతు కంట కన్నీరు

### గిట్టుబాటు ధర లేక విలవిల

**చేవెళ్ల అక్టోబర్ 31 విశాల జ్యోతి న్యూస్ ప్రతినిధి** ఆలూరు గ్రామం ఆరుగాలం శ్రమించి, అప్పులు చేసి పండించిన పంట చేతికొచ్చే వేళ మార్కెట్‌లో ధర పడిపోవడంతో చామంతి రైతు తీవ్ర సంక్షోభంలో చిక్కుకు న్నారు. ఆలూరు గ్రామానికి చెందిన రైతు కొండకల రాజు తనకున్న మూడు ఎకరాల్లో చామంతి సాగు చేపట్టారు. ఒక్కో మొలకకు రూ. 2 చొప్పున రూ. 15,000 వెచ్చించి నారు కొనుగోలు చేశారు. డ్రిప్ ఇరిగేషన్ పైపులు, ఎరువులు, పురుగుమందులు, దుక్కి దున్నకం, కలుపు తీత, కూలీల ఖర్చులతో కలిపి ఇప్పటివరకు సుమారు రూ. 6 లక్షల పెట్టుబడి పెట్టారు. పంట బాగా పండి దిగుబడి చేతికి వచ్చినా, మార్కెట్‌లో చామంతి ధర పూర్తిగా పతనమైంది. కనీస ధర కూడా లభించకపోవడంతో రైతు ఆశలు అడియాసలయ్యాయి.

"కూలీ డబ్బులూ చేతి నుంచే పెట్టాల్సి వస్తోంది"రైతు రాజు తన ఆవేదనను పంచుకుంటూ. "మొక్కలు నాటినప్పటి నుంచి కంటికి రెప్పలా కాపాడుకుంటూ రూ. 6 లక్షల వరకు అప్పు చేసి పెట్టుబడి పెట్టాను. తీరా పంట చేతి కొచ్చాక పూలు కోసి మార్కెట్‌కు తీసుకెళ్తే కనీస ధర కూడా పలకడం లేదు. పూలు కోసిన కూలీల డబ్బులు, రవాణా కిరాయిలు కూడా చేతి నుంచే చెల్లించాల్సి వస్తోంది. పెటన పెట్టుబడి, చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు" అని ఆయన కన్నీటిపర్యంతమయ్యారు.

## ఎన్టీఆర్ నగర్‌లో పర్యటించిన

### ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

- డ్రైనేజీ, తాగునీటి సమస్యలను వారం రోజుల్లో పరిష్కరించాలి -- అధికారులకు ఆదేశాలు

**చేవెళ్ల అక్టోబర్ 31 విశాల జ్యోతి న్యూస్ ప్రతినిధి శ్రీపాల్**

మహేశ్వరం నియోజకవర్గంలోని ఎన్టీఆర్ నగర్ డివిజన్ పరిధిలో గల ఎన్టీఆర్ నగర్ ఫేజ్-2, సాయిబాబా నగర్ ప్రాంతాల్లో గౌరవ మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి పి. సబితా ఇంద్రారెడ్డి గారు ఈరోజు విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక బస్తీ వాసులు తమ ప్రాంతాల్లో నెలకొన్న డ్రైనేజీ పొంగిపొర్లడం, మురుగునీటి సమస్యలు, తాగునీటి సరఫరాలో ఇబ్బందులను ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకువచ్చారు.

ప్రజల సమస్యలపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి గారు అక్కడే ఉన్న ఎవీఔా చంద్రు నాయక్ గారితో మాట్లాడి తాగునీటి సమస్యలను వారం రోజుల్లోగా పరిష్కరించాలని ఆదేశించారు. అదేవిధంగా పొంగిపొర్లుతున్న డ్రైనేజీ సమస్యపై ఈఈ కార్తీక్ గారితో ఫోన్‌లో మాట్లాడి, సుమారు 20 మీటర్ల మేర పైప్‌లైన్ దయా మీటర్‌ను పెంచి, పక్కనే ఉన్న నాలాకు అనుసంధానం చేయాలని సూచించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, మరో 20 రోజుల్లో తిరిగి ఈ ప్రాంతంలో పర్యటిస్తానని, అప్పటిలోగా తాగునీరు, డ్రైనేజీ సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు .ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించే వరకు అధికారులు నిర్లక్ష్యం చేయకుండా పని చేయాలని స్పష్టం చేస్తూ బస్తీ వాసులకు భరోసా కల్పించారు. ఈ పర్యటనలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, బస్తీ వాసులు పాల్గొన్నారు.

## డిప్రెషన్‌కు అందరికీ ఒకేలాంటి చికిత్స పనిచేయదు అధ్యయనంలో వెల్లడి

శరీరంలోని జీవ గడియారానికి సంబంధించిన సమస్యల వల్ల వచ్చే డిప్రెషన్‌ను సర్కేడియన్ డిప్రెషన్ అంటారు. క్రమం లేని నిద్ర విధానాలు, కాలానుగుణంగా మారే లక్షణాలు, నిద్రకు సంబంధించిన సమస్యలు ఈ రకమైన డిప్రెషన్‌తో ముడిపడి ఉంటాయి. తాజాగా నిర్వహించిన ఓ అధ్యయనం ఈ కొత్త రకం డిప్రెషన్‌ను గుర్తించింది. మన శరీరంలో 24 గంటల పాటు పనిచేసే అంతర్గత జీవ గడియారంతో దీనికి సంబంధం ఉంటుంది. ది బ్రిటిష్ జర్నల్ ఆఫ్ సైకియాట్రీలో ప్రచురితమైన ఈ అధ్యయనంలో, తీవ్రమైన డిప్రెషన్‌ను జీవ సంబంధిత, వైద్యపరమైన, జన్యుపరమైన లక్షణాల ఆధారంగా ప్రత్యేకమైన సర్కేడియన్ రకంగా వర్గీకరించవచ్చా అనే అంశాన్ని పరిశోధించారు. ఆస్ట్రేలియన్ జెనెటిక్స్ ఆఫ్ డిప్రెషన్ అధ్యయనానికి చెందిన సమాచారాన్ని ఉపయోగించి, డిప్రెషన్‌తో బాధపడుతున్న 10 వేల మందికి పైగా వ్యక్తులపై వైద్యపరమైన, జన్యుపరమైన విశ్లేషణ నిర్వహించారు.

చాలామందిలో సాధారణ యాంటీడిప్రెసెంట్ మందులు ఆశించిన ఫలితాలను ఇవ్వడం లేదు. ఎందుకంటే ఈ మందులు అందరిలోనూ డిప్రెషన్ ఒకే విధంగా ఉంటుందనే భావనతో పనిచేస్తాయి. అయితే సర్కేడియన్ రకానికి చెందిన డిప్రెషన్‌లో నిద్ర విధానాలు, శరీర జీవ గడియారంలో మార్పులు, కాలానుగుణ సమస్యలు కీలక పాత్ర పోషిస్తాయని పరిశోధకులు గుర్తించారు. ఈ రకమైన డిప్రెషన్ లక్షణాలు, జన్యుపరమైన అంశాలు ఇతర రకాలతో ఎలా భిన్నంగా ఉంటాయో తెలుసుకోవడమే అధ్యయనం లక్ష్యం. ఈ అధ్యయనంలో పాల్గొన్న వారిలో దాదాపు నాలుగో వంతు మందికి సర్కేడియన్ డిప్రెషన్ ఉన్నట్లు గుర్తించామని, వీరిలో తీవ్రమైన, పదేపదే వచ్చే లేదా దీర్ఘకాలిక డిప్రెషన్‌తో బాధపడేవారు కూడా ఉన్నారని పరిశోధకురాలు ఎమిలియానా టోనిని వెల్లడించారు.

సర్కేడియన్ డిప్రెషన్ లక్షణాలు..

ఈ రకమైన డిప్రెషన్ ఉన్నవారిలో నిద్ర, మేల్కొనే సమయాలకు సంబంధించిన కొన్ని ప్రత్యేక లక్షణాలు కనిపిస్తాయి. అవి.. ఉదయం వేళల్లో విపరీతమైన అలసట, డిప్రెషన్ సమయంలో సాధారణం కంటే ఎక్కువసేపు నిద్రపోవడం, రాత్రిపూట ఆలస్యంగా నిద్రపోయే అలవాటు, నిద్రలో మధ్య సమయం ఆలస్యంగా ఉండడం, సామాజిక జీవనశైలికి అనుగుణంగా నిద్ర సమయాలు లేకపోవడం, కాలానుగుణంగా వ్యాధి లక్షణాలు మారుతూ ఉండడం. డిప్రెషన్ అనేది అందరిలోనూ ఒకే విధంగా ఉండే వ్యాధి కాదని, దాని వివిధ రకాల లక్షణాలను అర్థం చేసుకోవడం ద్వారా బాధితులకు సరైన చికిత్సను ముందుగానే అందించవచ్చని పరిశోధకులు చెబుతున్నారు.

ఇతర రకాల డిప్రెషన్‌తో పోలిస్తే సర్కేడియన్ డిప్రెషన్ ఉన్నవారిలో కొన్ని ప్రత్యేక లక్షణాలు కనిపించాయి. వీరి సగటు వయసు సుమారు 18.7 సంవత్సరాలు ఉండగా, ఇతర రకాల డిప్రెషన్ ఉన్నవారిలో ఇది 23.2 సంవత్సరాలుగా నమోదైంది. ఈ రకమైన డిప్రెషన్ ఎక్కువగా మహిళల్లో కనిపించింది. మొత్తం కేసుల్లో దాదాపు 80 శాతం మంది మహిళలే ఉన్నారు. అలాగే వీరిలో వ్యాధి చిన్న వయసులోనే ప్రారంభమయ్యే అవకాశం ఉంది. వైద్యపరంగా కూడా ఈ రకం డిప్రెషన్ తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు అధ్యయనం గుర్తించింది. బైపోలార్ వ్యాధిలో కనిపించే లక్షణాలను పోలిన హైపోమానియా లేదా మానియా లక్షణాలు, మానసిక భ్రాంతులకు సంబంధించిన అనుభవాలు, ఆత్మహత్య ఆలోచనలు, వాటి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అలసట వంటి శారీరక సమస్యలతోపాటు మానసిక లక్షణాలు కూడా ఎక్కువగా కనిపిస్తాయి.

చికిత్సకు స్పందనలో తేడాలు..

సర్కేడియన్ డిప్రెషన్ ఉన్నవారిలో సాధారణంగా ఉపయోగించే కొన్ని యాంటీడిప్రెసెంట్ మందులు తక్కువ ప్రభావాన్ని చూపుతున్నట్లు అధ్యయనం వెల్లడించింది. ముఖ్యంగా సెరోటోనిన్ స్థాయిలపై పనిచేసే ఎస్ఎస్ఆర్ఐ, ఎస్ఎన్ఆర్ఐ తరహా మందులు ఆశించిన ఫలితాలను ఇవ్వడం లేదని బాధితులు తెలిపినట్లు పరిశోధకులు పేర్కొన్నారు. మరోవైపు శరీర జీవ గడియారానికి సంబంధించిన మెదడు వ్యవస్థలను లక్ష్యంగా చేసుకునే ప్రవర్తనా, వైద్య చికిత్సలకు వీరు మెరుగ్గా స్పందించే అవకాశం ఉంది. వీటిలో మెలటోనిన్, మెలటోనిన్‌పై పనిచేసే యాంటీ డిప్రెసెంట్ మందులు, కాంతి చికిత్స వంటివి ఉన్నాయి. ఈ రకమైన డిప్రెషన్ ఉన్నవారికి సాధారణంగా మొదట సూచించే మందులు ఎందుకు ఆశించిన ఫలితాలను ఇవ్వడం లేదో అర్థం చేసుకోవడానికి ఈ పరిశోధన ఉపయోగపడుతుంది.

బ్రెయిన్ అండ్ మైండ్ సెంటర్ సహ సంచాలకుడు, మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ ఇయాన్ హికీ మాట్లాడుతూ, యువతలో సర్కేడియన్ డిప్రెషన్‌ను గుర్తించకపోవడం వల్ల ప్రారంభ దశలోనే చికిత్స విఫలమయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయని, మందుల వల్ల దుష్ప్రభావాలు కూడా పెరుగుతున్నాయని వివరించారు. చాలామంది యువతకు మొదట ఎస్ఎస్ఆర్ఐ మందులనే సూచిస్తున్నారని, అయితే కనీసం నాలుగో వంతు మందికి జీవ గడియారాన్ని లక్ష్యంగా చేసుకునే వైద్య, ప్రవర్తనా చికిత్సలు మెరుగైన ఫలితాలను అందిస్తాయని ఆయన పేర్కొన్నారు. సర్కేడియన్ డిప్రెషన్ అనేది కేవలం నిద్రకు సంబంధించిన కొన్ని సమస్యల సమాహారం మాత్రమే కాదని, వైద్యపరంగా, జీవశాస్త్రపరంగా ప్రత్యేకమైన డిప్రెషన్ రకమని ఈ అధ్యయనం స్పష్టం చేసింది.

## రాత్రి ధనియాలను నానబెట్టి ఉదయాన్నే ఆ నీళ్లు తాగితే

### ఆరోగ్యానికి ఎంత మేలో తెలుసా

వంట గదిలో ఉండే రకరకాల మసాలా దినుసుల్లో ధనియాలు కూడా ప్రధానమైనవి. దాదాపు అన్ని రకాల వంటకాల్లో ధనియాలను సువాసన కోసం వినియోగిస్తుంటారు. ధనియాల్లోని ఔషధ గుణాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అందుకే మన పూర్వీకులు ధనియాలను ఆహారంలో భాగం చేశారు. అయితే ధనియాలను కేవలం వంటల్లో ఉపయోగించడం ద్వారా మాత్రమే కాకుండా.. ధనియాలను రాత్రంతా నీళ్లలో నానబెట్టి ఆ నీళ్లను ఉదయాన్నే తాగితే కూడా ఎన్నో ప్రయోజనాలు ఉంటాయట. మరి అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం..

ప్రయోజనాలు..

ఆరోగ్య నిపుణులు తెలిపిన ప్రకారం.. బరువు తగ్గాలనుకునే వారికి ఈ ధనియాల నీళ్లు ఎంతో మేలు చేస్తాయి. ధనియాల నీటితో జీవక్రియ మెరుగవుతుంది. జీర్ణ సంబంధిత సమస్యలకు చెక్ పెట్టొచ్చు. తీసుకున్న ఆహారం బాగా జీర్ణమవుతుంది. ధనియాల్లో విటమిన్ కె, విటమిన్ సి, విటమిన్ ఎ పుష్కలంగా లభిస్తాయి. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల జుట్టు ఆరోగ్యానికి ఎంతో మంచిది. ప్రతి రోజు ధనియాలు నానబెట్టిన నీటిని తీసుకుంటే జుట్టు రాలుడు సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. డయాబెటిస్ బాధితులకు కూడా ధనియాల నీరు ఎంతో ఉపయోగపడుతుంది. ముఖ్యంగా రక్తంలో షుగర్ లెవల్స్ ఎక్కువగా ఉండేవారు ప్రతి రోజూ ఉదయం నానబెట్టిన ధనియాల నీటిని తీసుకుంటే షుగర్ లెవల్స్ అదుపులో ఉంటాయి.

"VISHALA JYOOTHI" vide PRGI Registration No. "TGBIL/25/A0946" Printed by Published by DEVENDAR KUNTA on behalf of DEVENDAR KUNTA, printed atHAMARA WARANGAL PRINTERS AND GRAPHICS, H.NO: 25-8-182,BABUJI NAGAR, KAZIPET, WARANGAL, TELANGANA - 506003. and published at H.NO. 4-123/1,KUNTA WADA,RAIPARTHY, WARANGAL, TELANGANA - 506314. Editor DEVENDAR KUNTA, Cell : 9440711117.